క్లుప్తంగా

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

గూడెంకొత్తవీధి: కార్మిక పోరాటాలతో సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ మహాసభను పార్టీ నేత అప్పలనర్స ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయన్నారు. కార్మిక చట్టాలు సక్రమంగ అమలుకావడం లేదని, ఇందుకోసం ప్రతి కార్మికుడు న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణ, వెంకట్, లక్ష్మణరావు, విష్ణు కుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

గూడెంకొత్తవీధి: రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని తహసీల్దార్ కన్నాజీరావు కోరారు. మండలంలోని చాపరాతిపాలెం, రంపుల గిరిజనులతో శనివారం సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణతో కొందరు ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములు పోతున్నాయన్నారు. వాటికి పరిహారం వస్తుందని వివరించారు. జాతీయ రహదారి-513ఈకి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన రైతులు చెప్పిన సమస్యలను విన్నారు. కలెక్టర్ దృష్టిలో ఉంచి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు మాత్రం వారికి జరుగుతున్న అన్యాయాన్ని ఏకరువు పెట్టారు. ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి


దేముడు

గూడెంకొత్తవీధి: నిలిపివేసిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని వైస్ ఎంపీపీ లోతా దేముడు డిమాండ్ చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కనీస మానవత్వం లేకుండా దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడం దారుణమన్నారు. అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


అనంతగిరి(అరకులోయటౌన్): కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఫించన్ అందించాలన్నారు.

పశు వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ డాక్టర్ రాగిణి


జి.మాడుగుల: మండలంలో వంజరి సచివాలయం-2లో గొయ్యిగుంట గ్రామంలో శనివా రం సీఎస్ఏ, హృదయ్ ప్రాజెక్టు-ఎల్ఐసీ, హెచ్ఎఫ్ఎల్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. హ్రిదయ్ ప్రాజెక్టు మేనేజర్ కమలనాథ్, హార్టీకల్చర్ శాస్త్రవేత్త విద్యాసాగర్, బీసీటీ, కెవీకే వెటర్నరీ సైంటిస్ట్ డాక్టర్ రాగిణి, వెటర్నరీ అసిసెంట్ హరి మాట్లాడారు. పశు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారుకోళ్లు, మేకలు పశువులకు సంబంధించిన టీకాలు, మందులు వాడే విధానంపై గ్రామస్తులకు, సీఆర్పీలకు అందజేశారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన ట్యాంకర్

కొయ్యూరు: మండలంలోని రంపుల నుంచి గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట వైపు వస్తున్న జాతీయ రహదారికి చెందిన ఆయిల్ ట్యాంకర్ కాట్రగెడ్డ రహదారిలో బోల్తా పడింది. వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో కొంతవరకు రోడ్డుకు అడ్డంగా ఉండిపోయింది. డ్రైవర్ ముందుగానే అప్రమత్తం కావడంతో తృటిలో ప్రమాదం జరగలేదు. కొద్ది రోజుల క్రితం ఈ దారిలో ఆయిల్ ట్యాంకర్ కొండను ఢీ కొట్టి నుజ్జునుజ్జయింది.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


నల్లకుంటలో సేవలందిస్తున్న వైద్యులు

ఎటపాక: గౌరిదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మురుమూరు, విస్సాపురం గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరపీడుతుల రక్త నమూనాలు సేకరించి మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేసి బాధితులకు తక్షణ వైద్యం అందించారు. నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాసవాగులో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఫీవర్ సర్వే చేసి పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల వలన తీసుకోవలసిన ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.వైద్యులు శ్రీదేవి, దేవినాగ్, దుర్గాప్రసాద్, హెచ్‌వీలు లక్ష్మీ, వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో సర్కారు భవనాలు


లంతంపాడులో శిథిలావస్థకు చేరిన పాఠశాల రేకుల షెడ్డు


అరకులోయలో శిథిలావస్థలో తహసీల్దార్ క్వార్టర్

• కూలడానికి సిద్ధంగా నిర్మాణాలు • భయాందోళనలో స్థానికులు • అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన వైనం • పట్టించుకోని అధికారులు

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలోని గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందిస్తామని ప్రగాల్బాలు, ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయి ఆచరణలో ఏ మాత్రం అమలుచేయడం లేదు. ఫలితంగా ప్రస్తుతం ఏజెన్సీలోని ప్రభుత్వం పాఠశాల భవనాలు దారుణంగా దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యకు ప్రాధాన్యమిచ్చింది. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. దశాబ్దాల తరబడి పాడైన ప్రభుత్వ పాఠశాల భవనాల పునరుద్ధరణతో పాటు కొత్త భవనాల నిర్మాణం జరిగింది. ముఖ్యంగా ఏజెన్సీలో సర్కారు పాఠశాలల రూపురేఖలు మారాయి. అయితే మరింతగా విద్యాభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి..పనులకు శ్రీకారం జరిగింది. ఈ తరుణంలో ఎన్నికల కోడ్ అమలులో రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. అనంతరం అధికారురంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తయినా ఏజెన్సీలో ఒక్క పాఠశాల భవనం మరమ్మతు చేసినా దాఖాలాలు లేవు. కొత్త భవనం నిర్మించిన పరిస్థితి లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే పనులు చేపట్టని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యావ్యవస్థ రోజురోజుకు దిగజారుతోంది. అరకులోయ మండలంలో భవనాల లేని పాఠశాలలు, శిథిలావస్థలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి.

బిక్కుబిక్కుమంటూ

మండలంలోని మాలిశింగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఈ పాఠశాలలో 46 మంది చదువుకుంటున్నారు. గాతపాడు పాఠశాలలో 21 మంది, లంతంపాడు పాఠశాలలో 46 మంది, ఇరగాయిలో 15 మంది, భీముడువలసలో 25 మంది, బొండాంలో 34 మంది, వల్దిపనసలో 27 మంది పెదగంగగుడ్డిలో 15 మంది, రంపుడువలస పాఠశాలలు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు.

శిథిలభవనాలతో భీతి గొల్పుతున్న పరిసరాలు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఎంఈడీఓ కార్యాలయం ఆవరణలో పలు భవనాలు శిథిలస్థితికి చేరుకొని అవి ఎప్పుడు కూలిపోతాయో అన్న ఆందోళనకర పరిస్థితిలలో ఉన్నాయి. వీటిని నిర్వహణను అధికారులు పట్టించుకోవకపోవడంతో విష సర్పాలకు, అపరిశుభ్ర వాతావరణానికి నెలవుగా మారాయి. ఈ ప్రాంగణంలో విద్యాశాఖకు చెందిన రెండస్తుల భవనం దాదాపు కూలిపోయే పరిస్థితిలో ఉంది. గతంలో ఈ భవనాన్ని పాఠ్యపుస్తకాలను నిల్వ చేసేందుకు ఉపయోగించేవారు. వర్షం వస్తే కారిపోతుండడంతో ఉపయోగించకుండా వదిలేశారు. ఇదే ప్రాంగణంలో వ్యవసాయ శాఖ కార్యాలయం, గోడౌన్, ఎంపీడీవో కార్యాలయానికి చెందిన మరో గోడౌన్ గోడలు బీటలు వారి శిథిలదశకు చేరుకుంది. ఇదే ప్రాంతంలో పశువుల ఆస్పత్రి భవనంలో శిథిలావస్థలో దర్శనమిస్తోంది. ఇలా వుండగా... ఈ ప్రాంగణంలో నిత్యం వందల సంఖ్యలో సిబ్బంది పనిచేసే ఎంపీడీవో కార్యాయం, వెలుగు, ఉపాధి, విద్యాశాఖకు చెందిన మండల రిసోర్స్ కార్యాయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వచ్చేవారు ఈ శిథిలభవనాలను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ శిథిల భవనాలు చుట్టు పిచ్చి మొక్కలు పెరిగాయి. విషసర్పాలు సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా శిథిల భవనాలకు కూల్చి కొత్త భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


శిమిలిగుడలో శిథిలదశకు చేరిన పాఠశాల భవనం


రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శిథిలాస్థితిలో భవనాలు


రాజవొమ్మంగిలో శిథిలావస్థలో మండల వ్యవసాయ శాఖ భవనం

తుప్పలతో దర్శనం

నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలోని తహసీల్దార్ క్వార్టర్స్ నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గతకొన్నేళ్ల క్రితం నుంచి తహసీల్దార్ నివాసం ఉండడం లేదు. దీంతో క్వార్టర్ చుట్టు పిచ్చి మొక్కలు పెరిగాయి. ఈ క్వార్టర్ సుమారు 30 సెంట్లు పైగా విస్తీర్ణంలో ఉంది. ఈ క్వార్టర్ నిరుపయోగంగా మారింది. దీంతో అధికారులు ప్రైవేట్ నివాస గృహాలు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మరికొంతమంది మైదాన ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది నివాస గృహాలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ క్వార్టర్‌తోపాటు సిబ్బంది నివాస గృహాలు కూడా బాగుచేసి అందుబాటులోకి తీసుకువచ్చి, ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గోమంగిను మండల కేంద్రంగా ప్రకటించాలి

పెదబయలు: గోమంగిని మండల కేంద్రంగా ప్రకటించాలని గోమంగి మండల సాధన సమితి అధికారి ప్రతినిధులు కొమ్మ అనంత పద్మనాభం, సత్తిబాబు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 23 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గోమంగిలో మండల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తే 17 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉంటుందన్నారు. గోమంగి మండలం ఏర్పాటు చేయాలని 1998 నుంచి గోమంగి మండల సాధన సమితి పేరిట అనేక కార్యక్రమాలు చేశామన్నారు. అన్ని ప్రాంతాలకు సమీపంలో ఉన్న గోమంగిని మండలం ఏర్పాటు చేయాలన్నారు. గోమంగి ప్రస్తుతం పాడేరు జిల్లా కేంద్రానికి రావడానికి, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాలకు కలుపుతూ రోడ్డు సదుపాయం ఉందన్నారు. మేగరాజు, నాగరాజు, భగీరథరావు, కృష్ణబాబు, రాంబాబు, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి


ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ వినోద్ తదితరులు

అడ్డతీగల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ బి.నరసింహమూర్తి శనివారం సమావేశం నిర్వహించారు.గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిమజ్జనంలో ఎటువంటి డీజేల నిర్వహణకు అనుమతి లేదన్నారు. నిమజ్జనం వివరాలను పోలీసులకు ముందుగా అందజేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్ఐ వినోద్ తదితరులున్నారు.

నాగుపాము కలకలం


సుబ్బులు గ్రామంలో గిరిజనులు హతమార్చిన నాగుపాము

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ సుబ్బులు గ్రామంలో ఓ గిరిజనుడి ఇంట్లో నాగుపాము కలకలం రేపింది. సుబ్బులు గ్రామంలో పరిసర పొదళ్లు, పిచ్చి మొక్కల్లో నుంచి శనివారం సాయంత్రం 4గంటల సమయంలో కుమాడ దావీదు ఇంటిలోకి ఓ పాము ప్రవేశించింది.దీన్ని గమనించి దావీదు గ్రామంలో కొంతమందికి సమాచారం అందించాడు. కొంతమంది గ్రామస్తులు వచ్చి నాగుపామును కర్రలతో కొట్టి చంపేశారు. నాగుపాము 4అడుగులు పొడవు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. నాగుపాము నుంచి పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు చెప్పారు.

అరకు ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: నియోజకవర్గం పరిధిలోని డుంబ్రిగుడ మండలం, సొవ్వ పంచాయతీ కొరంజిగుడ గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పరామర్శించారు. ఈ ప్రమాదంలో సొవ్వ పంచాయతీ మలింగవలస గ్రామానికి చెందిన పాటి యోగేంద్ర నాయక్(26)ఒడిశా రాష్ట్రానికి చెందిన పూజారి ముకుంద(30) రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అరకులోయ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. పిన్న వయస్సులో పిల్లలను కోల్పోవడం దురదృష్టమన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు ఆస్పత్రి సూపరింటిండెంట్‌తో రాముతో మాట్లాడి అంబులెన్స్ సమకూర్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ పాంగి నరసింగరావు, నాయకులు బాక సింహాచలం, పి.రాంప్రసాద్, పాండోయి అశోక్ కుమార్, బొంజుబాబు, భాగ్యారావు, సాంబ, తిరుపతి, నగేష్, తదితరులున్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న ఆసావ్ బ్యాంక్ డైరెక్టర్ భాగ్యవతి

అరకులోయటౌన్: మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల 3వ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆసావ్ బ్యాంక్ డైరెక్టర్ జి. భాగ్య లక్ష్మి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో స్త్రీ అణచివేతకు గురవుతుందన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యు లు వి.వి.జయ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తికై లక్ష్యంతో ఐద్వా పనిచేస్తుందన్నారు. దేశంలో నానాటికి పెరుగుతున్న మహిళలపై అత్యాచారాలు, కుల దురంహార హత్యలు, మద్యం వంటివి అరికట్టాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు చేస్తున్న నిందితులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాల్లో మార్పు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా సుమిత్ర, కార్యదర్శిగా శశికళ, 8 మంది కార్యదర్శి వర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అర్హులనే ఆశా కార్యకర్తలుగా నియమించాలి


బాలదేవ్

అరకులోయటౌన్: అల్లూరి జిల్లాలో అర్హులందరికీ ఆశా కార్యకర్తలుగా నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. జిల్లాలో మొత్తం 124 ఆశ కార్యకర్తల ఉద్యోగాల నియామకానికి లెక్టర్ దినేష్ కుమార్ ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. అర్హుల పేర్లను డీఎంహెచ్ఓకు సిపార్సు చేశారన్నారు. సదరు జాబితాలో పేర్లు ఉన్న కొంతమంది అభ్యర్థుల వద్దకు వెళ్లి ఆశా కార్యకర్త పోస్టు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.1లక్ష వరకు డిమాండ్ చేస్తున్నారన్నారు. దీనిపై కలెక్టర్ సరైన చర్య తీసుకొని అర్హులకే పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి దళారులను కఠినంగా శిక్షించాలని కోరారు.

డ్రైనేజీ, రోడ్డు పనులకు శంకుస్థాపన


గలగండలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు


పెదబయలులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

పెదబయలు: మండలంలోని గలగండ పంచాయతీ మంగబంద గ్రామంలో సిసి డ్రైనేజీ పనులకు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, ఎంపీపీ బొండా వరహాలమ్మ పాల్గొన్నారు. మండలం సీతగుంట పంచాయతీ నిధులతో సిసి రోడ్డు పనులను సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు ప్రారంభించారు. కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, ఎంఈవో శివరామయ్య, నాయకులు కొండయ్య, గంగాధరం పాల్గొన్నారు.

వీఆర్వో మృతిపై విచారణ జరపాలి

ఎటపాక: కూనవరం మండలం చూచిరేవులగూడెం పంచాయతీలో వీఆర్వోగా పనిచేస్తున్న పండా అనోజ్‌కుమార్ మృతిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు పూసం శ్రీను శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా పట్టించుకోకుండా అధికారులు గోదావరి వరద డ్యూటీలు వేయడంతో తీవ్ర అనారోగ్యానికి గురై సచివాలయంలోనే అనోజ్‌కుమార్ మృతి చెందారని చెప్పారు. కింది స్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారులు విధుల కోసం ఒత్తిడి కారణంగానే వీఆర్వో మృతి చెందారని ఆరోపించారు. అనోజ్‌కుమార్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు

చింతపల్లి: మండలంలో గతంలో వాయిదా పడిన పీసా కమిటీ ఎన్నికలను ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.17 పంచాయతీల పరిధిలో గతంలో 10 పంచాయతీలో ఈ ఎన్నికల వాయిదా పడ్డాయన్నారు.ఈ ఎన్నికల్లో కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.


ఎన్నికలకు పంచాయతీ పరిధిలోన పీసా కమిటీ సభ్యులు విధిగా హాజరై ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

• అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం


గిరిజన మ్యూజియం వద్ద చెత్త తొలగిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు


అరకులోయలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు


మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ భరత్ కుమార్ నాయక్


పెదబయలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ముంచంగిపుట్టులో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, అధికారులు


చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో ప్రసాద్ తదితరులు


జి.మాడుగులలో ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీరభద్రరావు , తహసీల్దార్ రాజ్‌కుమార్


కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


వణకరాయిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది


వి.ఆర్.పురంలో మందులు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావు

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు తదితరులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. చెత్త కుండీల్లో పొడి చెత్త వేయాలని కోరారు. దోమ తెరలు వాడాలని, కాచీ చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ పనులు చేయించాలన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో లవరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. దొన్ను దొర, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, పీఆర్ డీఈఈ రామమ్, నాయకులు పాల్గొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, ఎస్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, పి.నాగబాబు, ఎం.అనిత కుమారి, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, డీటీ రంగారావు, ఏపీఎం దేవమంగ, ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్ప జోసెఫ్, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, నాయకుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఏవో మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ కృష్ణారావు, ఈవో పీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయితీ కార్యదర్శులు సింహాచలం, సూర్య, సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో ప్రసాద్, ఏపీఎం శ్రీనివాసరావు, జేఈ హేమలత, సీనియర్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీరభద్రరావు, తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఎంఈవో-2 వెంకటరమణమూర్తి, సర్పంచ్ కిముడు రాంబాబు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కిముడు మణికంఠ, రెవెన్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరావు , సర్పంచ్ పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావు, ఎంపీపీ కారం లక్ష్మీ, డాక్టర్ అనిల్ కుమార్, ఎంపీడీవో ఇమ్మానుయేల్, ఎంఈవో చిచ్చడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.